# ఎదురు తిరిగిన మోసం

నక్క జిత్తుల మారి అని గాడిదకి తెల్సు. అయినా దాని మాయ మాటలని నమ్మేసి స్నేహం చెయ్యడం మొదలు పెట్టింది.

ఒకరిని విడిచి మరొకరు సంచరించకూడదని ఇద్దరూ కలిసే తిరగసాగారు.

ఆ రోజు నక్క, గాడిద కలిసి అడవిలో సంచరిస్తుంటే హఠాత్తుగా సింహగర్జన వినిపించింది.

భయంతో పారిపోవాలని వెనక్కి తిరిగిన ఆ రెండు జంతువులకూ తమవంకే చూస్తూ గర్జిస్తున్న సింహాన్ని చూసేసరికి గుండెలు జారిపోయాయి.

నక్క ముందు తేరుకుని "ముందు మనం ఆ సింహంతో స్నేహం చేయకపోతే మన ప్రాణాలు పోతాయి ......" అంటూ ధైర్యంగా సింహం వేపు బయల్దేరింది నక్క.



సింహాన్ని చేరుకోగానే ముందు దాన్ని కాసేపు పొగిడి "ఆ గాడిద బాగా బలిసి ఉంది కాబట్టి దాన్ని తింటేనే మీ ఆకలి చల్లారుతుంది" అంది నెమ్మదిగా.

సింహానికి నక్క ఉపాయం అర్థమైంది. తన ప్రాణాన్ని కాపాడుకోవడం కోసం గాడిదని తినమంటోంది అని ఊహించింది. అయినా అమాయకంగా 'అలాగే' అని తల ఊపింది.

వెంటనే నక్క వెనక్కి వెళ్ళి 'నాతో రా....' అంటూ గాడిదను కొద్దిగా అవతలికి తీసుకెళ్ళి గుంటలో పడేట్లు చేసింది.

గాడిద గుంటలో పడి పడక ముందే సింహం నక్క మీదికి దూకింది.

'గుంటలో ఉంది కాబట్టి కాస్త ఆలస్యమైనా గాడిద పారిపోలేదు. కాని నువ్వు పారిపోతావ్' అంటూ నక్కని చీల్చి తన ఆకలిని తీర్చుకుంది సింహం.

మళ్ళీ ఆకలి వేసినపుడు తినవచ్చును లెమ్మని గాడిదను గుంటలోనే వదిలేసి వెళ్ళి పోయింది.

ఎవరు తీసుకున్న గోతిలో వాళ్ళే పడతారు! గాడిదను చంపాలనుకున్న తానే చచ్చింది!!

***

Stories for kids- Hudnreds of telugu books.. Just a click away- www.telugubooks.tk
Listen telugu audio books online.
Free telugu books. Telugu Pdf books online…